
## ఎకో టూరిజం అభివృద్ధికి..



2



2

## ట్రాక్టర్ కింద గంటన్నర పాటు నరకయాతన..



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న పలు హోటళ్లు, రెస్టారెంట్లను ఆహార భద్రతా అధికారి విక్రమ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా కొన్ని ఆహార వ్యాపార సంస్థల్లో మూతలు లేకుండా ఆహార పదార్థాలను నిల్వ చేయడం, అపరిశుభ్రమైన వంటశాలలు నిర్వహించడం, ఆహార తయారీ సిబ్బందికి ఆరోగ్య ధృవపత్రాలు లేకపోవడం, గ్లౌజులు, హెడ్ క్యాప్‌లు ధరించకపోవడం వంటి లోపాలను గుర్తించారు. సంబంధిత యాజమాన్యాలకు వెంటనే లోపాలను సరిదిద్దాలని సూచించారు.


23-6-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## ఎక్సైజ్ సూపరింటెండెంట్ అవినీతి.. ఆస్తులు చూసి షాకైన ఏసీబీ




**అక్షరటుడే, ఇందూరు :** రాష్ట్రంలోని పలు శాఖల్లో అవినీతి అధికారులు పాతుకుపోయారు. ఏళ్లుగా లంచాలు తీసుకుంటూ వందల కోట్ల అక్రమాస్తులు కూడబెట్టారు. తాజాగా నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డి ఇళ్లలో సోదాలు చేసింది. ఆయన అక్రమాస్తులను చూసి ఏసీబీ అధికారులే షాక్ అయ్యారు. ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు కావడంతో ఏసీబీ అధికారులు మంగళవారం అతని నివాసంతో పాటు అతని బంధువులు, బినామీలు ఇతర సహచరులకు చెందిన మరో 10 ప్రదేశాలలో సోదాలు నిర్వహించారు. తనిఖీల సమయంలో ఏసీబీ అధికారులు మల్లారెడ్డి పేరిట 5 నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. ఆయన పేరిట 8 ఖాళీ స్థలాలు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమిని గుర్తించారు. సుమారు రూ. 3.31 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు ఖాతాలో రూ.50 లక్షలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ భార్య, అతని కుటుంబ సభ్యుల పేర్ల మీద 3 బ్యాంకు లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. వాటిని త్వరలో తెరవనున్నారు. అవి తెరిస్తే మరిన్ని అక్రమాస్తుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. సోదాల సమయంలో అధికారులు నిందితుడి వద్ద ఒక గ్రాండ్ విటారా కారు, ఒక టీవీఎస్ స్కూటీ లభించాయి. ఈ మొత్తం ఆస్తుల విలువ రూ.3 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.100 కోట్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి: డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** 'నీట్' పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి డిమాండ్ చేశారు. పేపర్ లీక్‌కు నిరసన తెలుపుతూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ నిరసనకు ఆయన మంగళవారం మద్దతు తెలిపారు. నగేష్ రెడ్డి మాట్లాడుతూ 'నీట్' లీక్ ద్వారా దేశంలోని లక్షల యువత భవిష్యత్తును ఆగం చేశారన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడమేనని పేర్కొన్నారు. 'నీట్' ఒక పరీక్ష కాకుండా వేలంలా మారిపోయిందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివిన దానికి న్యాయం జరగాలని, వ్యవస్థలు బాధ్యతలో వ్యవహరించాలని అన్నారు. దేశ భవిష్యత్తు యువకులపైనే ఉందనే ఉద్దేశంతో రాహుల్ గాంధీ వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని, వారికి ఎలాంటి కష్టం వచ్చినా ముందుండి పోరాటం చేస్తున్నారన్నారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామ్ మోహన్, మండల అధ్యక్షుడు నవీపేట్ శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ నితిన్,కిష్టా గౌడ్,జావీద్, రాములు, సాయిరెడ్డి పాల్గొన్నారు.



వయసేమో 16.. చేతిలో రూ.లక్షల ఖరీదైన బైక్. ఇంకేముంది రయ్ రయ్ అంటూ రోడ్లపై సర్కస్ ఫీట్లు. కట్ చేస్తే ఒకరి ప్రాణం గాలిలో కలిసిపోయింది. మైనర్ల వాహనాల డ్రైవింగ్‌ను కంట్రోల్ చేయడంలో వారి తల్లిదండ్రులు, పోలీసులు విఫలం అవుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరం అని నామమాత్రానికే చెప్తున్నారని, కట్టడి చేయడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అవుతుందన్న ప్రచారం సాగుతోంది.

- అక్షరటుడే, కామారెడ్డి

# మైనరూ.. తగ్గాలి జోరు..

- ఫ్రీ హ్యాండ్ ఇస్తున్న తల్లిదండ్రులు
- రోడ్లపై స్పోర్ట్స్ బైకులతో మైనర్ల విన్యాసాలు
- తాజాగా ఒకరి ప్రాణం తీసిన మైనర్ డ్రైవింగ్
- పట్టించుకోని పోలీసులు, పేరెంట్స్

కామారెడ్డి పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లో మైనర్ డ్రైవింగ్, సర్కస్ విన్యాసాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. వచ్చి రాని డ్రైవింగ్‌తో రోడ్లపైకి వెళ్లి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విపరీతమైన శబ్దాలు కలిగిన వాహనాలతో న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్నారు. మందలించాల్సిన తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహిస్తున్నారు. కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఇతర ముఖ్యమైన విధుల్లో పట్టించుకోవడం లేదన్న ప్రచారం సాగుతోంది. ఇలాంటి క్రమంలో మైనర్ డ్రైవింగ్ కట్టడి చేయడం ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### ఫ్రీ హ్యాండ్ ఇస్తున్న తల్లిదండ్రులు

పిల్లలపై అతి ప్రేమ, స్టేటస్ కోసం రూ.లక్షలు పోసి స్పోర్ట్స్ బైకులు కొనిస్తున్నారు కొందరు తల్లిదండ్రులు. బాగా చదివితే బైక్ కొనిస్తామని ఊరిస్తున్నారు. 18 ఏళ్లు నిండకుండా, లైసెన్స్ లేకుండా వాహనం ఇవ్వడం నేరమని తెలిసినా పట్టించుకోవడం లేదు. మోటార్ వాహన చట్టం ప్రకారం మైనర్‌కు వాహనం ఇస్తే యజమాని అంటే తల్లిదండ్రులకే రూ.25 వేలు జరిమానా, 3 ఏళ్ల జైలు శిక్ష పడుతుంది. వాహన రిజిస్ట్రేషన్ కూడా ఏడాది పాటు రద్దు అవుతుంది. అయినా భయం లేకుండా ఫ్రీ హ్యాండ్ ఇవ్వడం గమనార్హం.

### స్పోర్ట్స్ బైకులతో విన్యాసాలు

కామారెడ్డి పట్టణంలో సాయంత్రం అయిదంటే చాలు.. స్పోర్ట్స్ బైకుల హవా మొదలవుతుంది. సైలెన్సర్లు మార్చి విపరీతమైన శబ్దాలతో, వీలింగ్, త్రిబుల్ రైడింగ్ చేస్తూ న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్నారు. ప్రధాన రోడ్లు, కాలేజీ పరిసరాలు వీరికి సర్కస్ మైదానాలుగా మారాయి. దీంతో సాధారణ ప్రజలు, వృద్ధులు, మహిళలు రోడ్డు దాటాలంటేనే భయపడుతున్నారు. వీరి నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల ఎప్పుడు ఎవరికి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

### ప్రాణం తీసిన మైనర్ డ్రైవింగ్

కామారెడ్డి మండలం ఇల్చిపూర్ శివారులో గత వారం 16 ఏళ్ల మైనర్ నడిపిన బైక్ ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎదురుగా వస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మైనర్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఇలాంటి ఘటనలు వెలుగుచూడటం ఇటీవల కొత్తేమి కాదు. ప్రతి ప్రమాదం తర్వాత రెండు రోజులు హడావుడి చేసి ఆపై మర్చిపోవడమే పరిపాటిగా మారింది. ఒక్కో ప్రాణం గాల్లో కలిసిపోతున్నా మార్పు రావడం లేదు.

### చర్యలు కరువు

మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరం అని పోలీసుశాఖ నామమాత్రానికే చెప్తోందన్న అపవాదు ఉంది. కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఇతర ముఖ్యమైన విధుల్లో తలమునకలై ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదన్న ప్రచారం సాగుతోంది. స్పెషల్ డ్రైవ్‌లు, కాలేజీల వద్ద తనిఖీలు అరకొరగానే జరుగుతున్నాయి. మందలించాల్సిన తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహిస్తుండగా, చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో మైనర్ డ్రైవింగ్‌ను కట్టడి చేయడం ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### స్పెషల్ డ్రైవ్ చేపడతాం



మైనర్ డ్రైవింగ్ పై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. త్వరలో మైనర్ డ్రైవింగ్ కట్టడి కోసం స్పెషన్ డ్రైవ్ చేపడతాం. కళాశాలలు, పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వాటిని మరింతగా కొనసాగిస్తాం. మైనర్లకు వాహనాలు ఇచ్చేటప్పుడు తల్లిదండ్రులు ఆలోచించాలి. పిల్లలకు ఏది, ఎంతమేరకు అవసరమో వాటిని మాత్రమే ఇవ్వాలి. అప్పుడే పిల్లల భవిష్యత్తు బాగుంటుందనేది తల్లిదండ్రులు ఆలోచించాలి.

- రాజేష్ చంద్ర, ఎస్పీ కామారెడ్డి



## దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామాప్రసాద్

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** దేశ సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతి ఐక్యత కోసం ఒక దేశం, ఒక చట్టం, ఒక రాజ్యాంగం అని నినదించిన మహనీయుడు అని కొనియాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు మఠం పవన్, బెల్లాల్ శశాంక్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, బొబ్బిలి సువర్ణ వేణు, కల్పే అర్చనా చిరంజీవి, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, ప్రసన్న సత్యపాల్ పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో చేరికలు

**అక్షరటుడే, భీమ్‌గల్:** నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయం వేడెక్కుతోంది. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు, ఇతర పార్టీల నేతలను కాంగ్రెస్ గూటికి చేర్చుకునే కార్యక్రమాలు ఊపందుకున్నాయి. తాజాగా జరిగిన కార్యక్రమంలో ముచ్కూర్ సొసైటీ మాజీ చైర్మన్ వెంకటేష్, బడా భీమ్‌గల్ 12వ వార్డు సభ్యుడు మాంద్ర సుమన్, బీఆర్ఎస్ కార్యకర్తలు నెల్ల రంజిత్, మూర్తి, మహేష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సునీల్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో భీమ్‌గల్ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, ముల్గురి గణేష్, రాగుల మోహన్, అరిగేల జనార్ధన్, సతీష్, అంజుమ్, స్వామి, గట్టు సతీష్, శ్రీధర్ గౌడ్, కోమటి శంకర్, కుమ్మరి శంకర్ పాల్గొన్నారు.

## తాడ్వాయిలో హై టెన్షన్.. మండల కేంద్రం అష్టదిగ్బంధనం



**అక్షరటుడే, తాడ్వాయి:** మండల కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న యూరియా యాప్ రద్దు కోసం బీఆర్ఎస్ భారీ ధర్నాకు పిలుపునివ్వడంతో అధికార యంత్రాంగం అలర్ట్ అయ్యింది. ధర్నాకు పర్మిషన్ లేదని, ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్నా జరగకుండా చూసేందుకు పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అర్ధరాత్రి నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. మరికొంత మంది కోసం పోలీసులు వెతుకుతున్నారు. ఇళ్లు, ఆఫీసులు, వ్యవసాయ పొలాల వద్ద నాయకుల కోసం సెర్చ్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ధర్నాకు వస్తున్నారని తెలియడంతో పోలీసులు మరింత పకడ్బందీగా భద్రత ఏర్పాటు చేశారు. తాడ్వాయికి వస్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తూ, అన్ని మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల కేంద్రాన్ని పూర్తిగా పోలీసులు అష్టదిగ్బంధనం చేశారు. అనుమానం వచ్చిన ప్రతి వ్యక్తిని అక్కడి నుంచి పంపించేయడంతో తాడ్వాయిలో ఏం జరుగుతుందో తెలియక హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఇదిలా ఉండగా తాడ్వాయిలో రైతు ధర్నాకు వెళ్లకుండా మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలోనే పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ను కూడా హైదరాబాదులో హౌస్ అరెస్ట్ చేసి, తాడ్వాయికి వెళ్లకుండా ఇంటి ముందు పోలీసులను మోహరించారు. అయితే ఆయన పోలీసుల కళ్లు గప్పి సాధారణ వ్యక్తిలా బైక్‌పై ధర్నాకు వచ్చాడు. జై బీఆర్ఎస్, జై తెలంగాణ అంటూ ధర్నాకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో పోలీసులకు, మాజీ ఎమ్మెల్యేకు మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం మాజీ ఎమ్మెల్యేను పోలీసులు అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించారు.





## యూరియా పేరుతో రైతులను రెచ్చగొడితే ఊరుకునేది లేదు..



**అక్షరటుడే, కామారెడ్డి:** యూరియా పేరుతో రైతులను రెచ్చగొడితే ఊరుకునేది లేదని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ రావుతో కలిసి మదన్ మోహన్ రావు మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ.. సోషల్ మీడియా వేదికగా కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు యూరియా యాప్(Urea App) పేరుతో రైతుల మీద పడ్డారని మండిపడ్డారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని సొసైటీలకు యూరియా సరఫరా అయిందని, బీఆర్ఎస్ నాయకులకు చదువు రాదని, చెప్తే అర్థం చేసుకోరని విమర్శించారు. పీఏసీఎస్ చైర్మన్లుగా కొనసాగుతూ బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేస్తూ డీడీలు కట్టకుండా యూరియా రాకుండా చేసి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని, ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వాళ్ల డేటా అంతా తమ దగ్గర ఉందని, ఒక్కొక్కరిని లోపల వేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. సోషల్ ఎలిమెంట్ యాక్ట్ కింద చర్యలు తప్పవని, యాప్‌లో టెక్నాలజీ ద్వారా రైతులకు యూరియా అందించాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని స్పష్టం చేశారు. గతంలో వీరంతా మధ్యలో బ్రోకర్లుగా ఉండి కమీషన్లు తీసుకుంటూ ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులకు అమ్ముకుని సంపాదించిన రోజులు ఉన్నాయని, వారి లెక్కలు తీస్తే కటకటాల లోపలికి వెళ్తారన్నారు. యూరియా యాప్‌లో సాంకేతిక సమస్యలు, కొన్నిచోట్ల నెట్‌వర్క్ సమస్య ఉన్నమాట వాస్తవమేనని, వాట్సాప్, సోషల్ మీడియాలో వచ్చేవి నమ్మి రైతులు బలికావద్దని కోరారు. ఇది రైతు ప్రభుత్వమని, ఇందిరమ్మ ఇళ్లు వేలాదిగా కట్టిస్తున్నామని, కేటీఆర్ పదేళ్లలో ఎన్ని ఇళ్లు కట్టించారో చెప్పాలని ప్రశ్నించారు. వాళ్ళ ప్రభుత్వం ఏర్పడినట్టు, కేటీఆర్ సీఎం అయినట్టు ఫీల్ అవుతున్నారని, రెండేళ్లే కదా అయింది. సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్లు పెట్టుకుంటూ.. ఎందుకు అంతలా ఆగమాగమవుతున్నావ్ అంటూ కేటీఆర్ నుద్దేశించి వ్యాఖ్యానించారు. రైతుల సమస్యల కోసం డీసీసీ కార్యాలయంలో కమిటీ ఏర్పాటు చేస్తామని, అరాచకాలు సృష్టించి రైతులను రెచ్చగొడితే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. 140 ఏళ్ల కాంగ్రెస్ చరిత్రలో కామారెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఉందని కానీ.. జిల్లాలో పార్టీ కార్యాలయం లేకపోవడం విచారకరమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు అన్నారు. అది ఎందుకు జరగలేదో తెలియదన్నారు. డీసీసీ అధ్యక్షుడిగా వచ్చిన తక్కువ కాలంలోనే ఏలే మల్లికార్జున్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వం ఎకరం స్థలం కేటాయించిందని తెలిపారు. రూ.4.80 లక్షల ఫీజును ఇద్దరు ఎమ్మెల్యేలం చెల్లించామన్నారు. ప్రభుత్వానికి ఒక్క రూపాయి బాకీ లేమని స్పష్టం చేశారు. పార్టీ కార్యాలయం పేరుతో ఎవరూ చందాలు, విరాళాలు చేయవద్దని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు నిమ్మ విజయ్ కుమార్, కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలరాజు, రెడ్డి నాయక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ కింద గంటన్నరపాటు నరకయాతన..



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** ట్రాక్టర్ ఇంజిన్ మీద పడటంతో ఎటూ కదల్లేని స్థితిలో ఓ వ్యక్తి గంటన్నర పాటు నరకయాతన పడ్డాడు. ఈ ఘటన డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లిలో జరిగింది. సాంపల్లి గ్రామానికి చెందిన మాసూరి సుభాష్ తన ట్రాక్టర్‌పై మెంట్రాజ్ పల్లి కొచ్చేరుకు వెళ్లాడు. చెరువు కట్టపై ఉన్న ట్రాలీని తీసుకొచ్చే క్రమంలో ట్రాక్టర్ ఇంజిన్ ఒక్కసారిగా కట్ట కిందకు జారిపోయి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్ కింద సుభాష్ ఎటూ కదల్లేని స్థితిలో ఇరుక్కున్నాడు. దీంతో ఆయన అరుపులు, కేకలు వేశాడు. చెరువు కట్ట ప్రాంతంలో పొలం పనుల్లో ఉన్న రైతులు, విద్యుత్ సిబ్బంది వచ్చి వెతకగా ఈత చెట్ల మధ్యలో ట్రాక్టర్ ఇంజిన్ కింద సుభాష్ కాళ్లు కనిపించాయి. వెంటనే మెంట్రాజ్ పల్లి, సాంపల్లి గ్రామస్థులకు సమాచారం ఇచ్చి వాట్సాప్ గ్రూప్‌లలో సమాచారాన్ని పోస్ట్ చేశారు. జేసీబీని రప్పించిప్పటికీ ట్రాక్టర్ ఇంజిన్ వరకు వెళ్లే మార్గం కనిపించలేదు. దీంతో సాంపల్లి ఇటుక బట్టీలోని క్రేన్‌ను తెప్పించారు. చెట్ల మధ్యలో ఉన్న ట్రాక్టర్ ఇంజిన్‌ను ఎట్టకేలకు పైకి లేపడంతో ఇంజన్ కింద ఇరుక్కున్న సుభాష్ బయటపడ్డాడు.



## లయన్స్ భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని కిసాన్‌నగర్‌లోని లయన్స్ భవనంలో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో మోతిబిందు సమస్య ఉన్న వారిని గుర్తించి శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ చాకు లింగం, జోనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, కోశాధికారి వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై సీహెచ్ సతీష్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ, క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, విద్యార్థులు తమ లక్ష్యాల వైపు పయనించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయన్న, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎకో టూరిజం అభివృద్ధికి ముందడుగు..

తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ పరిధిలో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా పర్యాటకాన్ని పెంపొందించడమే కాకుండా, స్థానిక నిరుపేద యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా అధికారులు ఒక కీలక కార్యక్రమాన్ని చేపట్టారు.

- అక్షరటుడే, ఇందూరు



**■ ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ పరిధిలో.. ■ స్థానిక యువతకు ప్రత్యేక శిక్షణ ■ ముందుకొచ్చిన స్వచ్ఛంద సంస్థలు**

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఎకో టూరిజం ప్రాజెక్టును విజయవంతం చేయడం కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, ప్రముఖ స్వచ్ఛంద సంస్థ 'నిర్మాణ్' భాగస్వామ్యంతో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా మొదటి విడతగా చిన్నాయనం గ్రామానికి చెందిన తొమ్మిది మంది నిరుపేద యువకులను ఎంపిక చేసి, వారికి హైదరాబాద్‌లో 15 రోజుల పాటు వసతితో కూడిన ప్రత్యేక వృత్తి నైపుణ్యాల శిక్షణను అందించారు.

### శిక్షణలో నేర్పిన అంశాలివే..

సందర్శకులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించడాన్ని.. వారి అవసరాలను గుర్తించి ఉత్తమ సేవలు అందించడంపై శిక్షణ ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే పర్యాటకులతో సమర్థవంతంగా, మృదువుగా మాట్లాడే విధానంపై అవగాహన కల్పించారు. రుచికరమైన వంటకాలు చేయడం, వంటగదిని అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం పరిశుభ్రంగా ఉంచడంపై అనుభవజ్ఞులతో శిక్షణ అందించారు. పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా ప్రకృతిని కాపాడుతూ, నైతిక విలువలతో టూరిజం నిర్వహించడం వంటి అంశాలు వివరించారు.

### గైడ్‌లు.. హాస్పిటాలిటీ సిబ్బందిగా ఉపాధి

త్వరలోనే ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో ప్రారంభం కానున్న ఎకో టూరిజం ప్రాజెక్టులో శిక్షణ పొందిన ఈ యువకులను గైడ్‌లుగా, హాస్పిటాలిటీ సిబ్బందిగా నియమించనున్నారు. దీని ద్వారా పర్యాటకులకు అద్భుతమైన, మరపురాని అనుభూతిని అందించడమే లక్ష్యం తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కృషి చేస్తోంది. ఈ కార్యక్రమంతో స్థానిక యువతకు స్థిరమైన ఉపాధి లభించడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల స్థిరమైన అభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు, ఎకో టూరిజం ప్రమోషన్‌కు ఎంతో ఊతం లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటక కేంద్రంగా మారితే ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## వర్షంతో రైతుల బిజీ

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలో రెండుమూడు రోజుల నుండి వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రి సమయంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వర్షం పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగు పనుల్లో బిజీ అయ్యారు. విత్తనాలు వేసుకోవడానికి సిద్ధం అవుతున్నారు. ఎరువులు, విత్తనాల కోనుగోలు కోసం దుకాణాలకు వెళ్తున్నారు.



## విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి


**అక్షరటుడే, నందిపేట్:** ఈనెల 23 నుండి 30వ వరకు మండలంలోని అన్ని రైతు వేదికల్లో విత్తన మేళా నిర్వహించనున్నట్లు ఏవో రాంబాబు తెలిపారు. ఈ విత్తన మేళాలో ప్రభుత్వం సూచించిన 7 రకాల సన్న రకం వరి విత్తనాలు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. రైతులందరూ తమకు కావాల్సిన నాణ్యమైన వరి విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేసి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవోడ తిరుమల, ఫెర్టిలైజర్ అండ్ సీడ్స్ షాపుల యజమానులు, కిసాన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దమ్మాయి శీను పాల్గొన్నారు.



## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఏడో బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ అన్నారు. డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో 'రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ట్రాఫిక్ భద్రతా ప్రతిజ్ఞ' నిర్వహించారు. కమాండెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో వెళ్లేవారు సీట్‌బెల్ట్ వినియోగించాలని, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచికలను తప్పనిసరిగా పాటించాలని, పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది ప్రజలకు ఆదర్శంగా నిలుస్తూ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. అధికారులు, సిబ్బందితో ట్రాఫిక్ భద్రతా ప్రతిజ్ఞ చేయించారు.

## మెండోరాలో 'ఏక్ పేడ్ మా కే నామ్'



**అక్షరటుడే, భీమ్‌గల్:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బీజేపీ భీమ్‌గల్ మండల అధ్యక్షుడు అరె రవీందర్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. ఏలేటి మల్లికార్జున్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం భీమ్‌గల్ మండలం మెండోరా గ్రామంలో బీజేపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో 'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ తల్లి జ్ఞాపకార్థం, ఆమె పేరిట కనీసం ఒక మొక్కనైనా నాటి, దాన్ని సంరక్షించాలని కోరారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షుడు తక్కూరి అంజయ్య, వీడీసీ ఛైర్మన్ చేగంటి గంగాధర్, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జి గాడి వేణు, సీనియర్ నాయకులు పార్వతి శ్రీనివాస్ గౌడ్, సిలివరి రమణ చారి, బొడిగె లింబాద్రి గౌడ్, రాంచందర్ గౌడ్, తక్కూరి సాయి రెడ్డి, సంగెపు గంగాధర్, జాగిర్యాల్ శ్రీకాంత్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## నాగులూరు నిధుల గోల్‌మాల్‌పై గ్రామస్తుల ఆగ్రహం



**అక్షరటుడే, గాంధారి :** మండలంలోని నాగులూరు గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ, పంచాయతీ నిధులు పెద్దఎత్తున దుర్వినియోగమయ్యాయంటూ గ్రామస్తులు సోమవారం 'ప్రజావాణి'లో కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన కలెక్టర్, సమగ్ర విచారణ జరపాలని డీఎల్‌పీవో సురేందర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం నాగులూరు గ్రామానికి చేరుకున్న డీఎల్‌పీవోకు గ్రామస్తులు, యువత ఆధారాలు చూపించారు. కేంద్ర ఆడిట్ రిపోర్ట్ ప్రకారం.. ఎలాంటి అధికారిక అనుమతులు, సెక్రెటరీ సంతకాలు లేకుండానే రూ.17.64 లక్షల ఉపాధి నిధులను డ్రా చేశారని ఆధారాలు చూపించారు. అలాగే 'మేరీ పంచాయతీ' యాప్ రికార్డుల ప్రకారం.. వచ్చిన నిధుల కంటే రూ.8.44 లక్షలు అదనంగా ఖర్చు చూపించడంపై అధికారులను నిలదీశారు. కారోబార్ ఖాతాలోకి రూ.1.57 లక్షలు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో గ్రామస్తులు, సర్పంచ్ వర్గీయుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే, పక్కా ఆధారాలున్నా డీఎల్‌పీవో స్పందించకుండా, 'గ్రామస్తులు సహకరించడం లేదు' అని రాసి కేసు ముగిస్తానని అనడంతో యువత మండిపడ్డారు. గొడవ పెద్దది కావడంతో డీఎల్‌పీవో విచారణను మధ్యలోనే ఆపేసి వెనుదిరిగారు. ఈ విషయమై డీఎల్‌పీవో సురేందర్ మాట్లాడుతూ.. విచారణ సమయంలో ఇరువర్గాల మధ్య గొడవ జరగడం వల్లే మధ్యలో రావాల్సి వచ్చిందన్నారు. అంతేకాకుండా, గతంలో పనిచేసిన సెక్రటరీ విచారణకు హాజరుకాకపోవడం కూడా ఒక కారణమన్నారు. త్వరలోనే మరో తేదీని ప్రకటించి, పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని ఆయన స్పష్టం చేశారు.

## వంగిన విద్యుత్ స్తంభం.. పట్టించుకోని అధికారులు





**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలోని పోచారం తండా శివారులో విద్యుత్ స్తంభాలు వంగిపోయి, ఎప్పుడు కూలిపోతాయో తెలియని స్థితిలో ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోచారం తండాకు చెందిన ఓ రైతు చేనులో గత కొన్ని నెలలుగా ఒక విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా వంగిపోగా.. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అప్పట్లో స్పందించిన అధికారులు.. వంగిన స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఇటీవల రైతులు ఫోన్ ద్వారా అధికారులను సంప్రదించగా.. ప్రస్తుతం తమ వద్ద విద్యుత్ స్తంభాలు అందుబాటులో లేవని సమాధానం చెప్పడం విడ్డూరంగా ఉందని రైతులు మండిపడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులు చేసుకోవడానికి భయపడుతున్నామని, ఆ స్తంభం ఎప్పుడు కూలిపోతుందో తెలియక ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏడీ అరవింద్‌ను వివరణ కోరగా.. ఈ సమస్య ఇప్పటికే తన దృష్టికి వచ్చిందని, త్వరలోనే వంగిన స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## ఏఐటీయూసీ మహాసభలకు తరలిన నాయకులు




**అక్షరటుడే, ఇందూరు:** హైదరాబాద్‌లో ఏఐటీయూసీ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాలుగో మహాసభలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రం నుంచి నాయకులు బస్సులో తరలివెళ్లారు. ఈ బస్సును నాయకుడు రమేష్ బాబు జెండా ఊపి ప్రారంభించారు.




**నగరంలోని రద్దీ ప్రాంతాల్లో మడిగెలు అద్దెకు తీసుకోవాలంటే రూ.వేలల్లో చెల్లించాల్సి ఉంటుంది. దీంతో చాలామంది వ్యాపారం చేసేందుకు వెనకాముందూ ఆలోచిస్తుంటారు. అయితే ఓ మటన్ విక్రయించే వ్యాపారి వినూత్నంగా ఆలోచించాడు. నగరంలోని ఆర్యనగర్ ప్రాంతంలో ఆటోలోనే మటన్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మడిగెల అద్దె భరించలేక గిరాకీ కూడా బాగుందని వ్యాపారి పేర్కొన్నారు.** – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో డ్రగ్స్ అవేర్నెస్‌పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థినులకు డ్రగ్స్‌పై ఎస్సై రజనీకాంత్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రిక, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.